సాక్షి
అనంతపురం
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.26,500

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,500 పలికాయి.



రైతు చూపు.. పత్తి వైపు

ఈ వేసవిలో రైతులు పత్తి పంట వైపు దృష్టి సారించారు. వ్యవసాయ బోర్లు, బావుల కింద పత్తి పంటను సాగు చేస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.5°/22.1°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

కుట్రలకు చరమగీతం

• కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే జిల్లాకు 8న వైఎస్ జగన్ రాక • పెద్ద ఎత్తున తరలి వచ్చి సంఘీభావం తెలపాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రజల్లో భయం పుట్టించేందుకే కురుబ లింగమయ్య హత్య
- దారుణ ఘటనను అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలి
- లింగమయ్యలా మరో కార్యకర్తకు అన్యాయం జరగకూడదు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పిలుపు
- మాజీ సీఎం పర్యటన ఏర్పాట్లపై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: ''ఫ్యాక్షన్ ఆనవాళ్లే ఉండ కూడదని గడిచిన ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. ఈ కుట్రలు, కుతంత్రాలు ఎంతో కాలం సాగవు. చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి' అని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు.టీడీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త కురుబ మజ్జిగ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈనెల 8న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో శనివారం నగరంలోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మాజీ మంత్రి శంకరనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సతీష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8న ఉదయం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో చెన్నేకొత్తపల్లికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా 10 గంటలకు పాపిరెడ్డిపల్లికి చేరుకుని లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతలను కాపాడే అంశంలో తరతమ భేదాలు లేకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు నిత్యకృత్యమయ్యా యన్నారు. కేవలం తమ ఉనికిని కాపాడుకునేందుకు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను హతమార్చడం వారి క్రూర ఆలోచన విధానానికి అద్దం పడుతోందన్నారు. ఎన్నికలకు ముందు అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పది నెలలవుతున్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయలేదని విమర్శించారు.సమావేశంలో మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ కదిరి, మడకశిర నియోజకవర్గాల సమన్వయకర్తలు మక్బూల్‌బాషా, ఈరలక్కప్ప, ఎస్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మీ శ్రీనివాస్, నదీం అహమ్మద్, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, గంగుల భానుమతి, మీసాల రంగన్న, పామిడి వీరా, రంగంపేట గోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసులకు భయపడొద్దు



ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని మనల్ని ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు. పోలీసుల కేసులకు ఎవరూ భయపడొద్దు. నాకు జైలు, బెయిలు కొత్తకాదు. రెండున్నరేళ్ల జైలు జీవితం గడిపా. మహా అంటే కేసులు నమోదు చేస్తారు, లేదంటే రిమాండ్‌కు పంపుతారు, అంతకంటే ఏం చేస్తారు. కార్యకర్తలెవరూ భయపడొద్దు. రాజన్న భక్తులు, జగనన్న సైనికులు 8న పాపిరెడ్డిపల్లికి తరలిరావాలి. చంద్రబాబు చేతిలో మోసపోయిన మహిళలు, నిరుద్యోగులు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున వచ్చి జగనన్నకు సంఘీభావం తెలపాలి. లింగమయ్యదే చివరి రాజకీయ హత్య కావాలి. ఈ ఘటనను అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే నేర వ్యవస్థ రాప్తాడు నియోజకవర్గంలో ఉంది. ఈ సంప్రదాయాన్ని ఇక్కడే అణిచి వేయాలి.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఏమాత్రమూ భయపడే ప్రసక్తేలేదు. మా నాయకుడు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడితే చంద్రబాబు గెలిచిన రోజు నుంచి దౌర్జన్యాలు, అరాచకాలకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పార్టీ శ్రేణులు పోరాడతాయి.

– శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

జెండా కట్టినా కేసుల నమోదు



రాష్ట్రంలో ఎక్కడా ఫ్యాక్షన్ ఉండకూడదని గత ఐదేళ్లలో వైఎస్ జగన్ గట్టి చర్యలు తీసుకున్నారు. ఏ ఒక్క కుటుంబం బలికాకూడదనే ఉద్దేశంతో పోలీసులకు స్వేచ్ఛ కల్పించారు. విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కానీ, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో వైఎస్సార్ సీపీ జెండా కడితే కూడా కేసులు నమోదు చేస్తున్నారు.

– మంగమ్మ, ఎమ్మెల్సీ

అరాచకాలు పేట్రేగిపోయాయి



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో అరాచకాలు పేట్రేగిపోయాయి. స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితిని టీడీపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కల్పించలేదు. స్థానిక సంస్థల స్థానాల్లో ఏమాత్రం బలం లేకపోయినా పోలీసు, రెవెన్యూ అధికారులను అడ్డుపెట్టుకుని కుట్ర చేశారు. ఇందులో భాగంగానే కురుబ లింగమయ్యను హత్య చేశారు. ఎస్పీ దుస్తులను కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు వేసుకుని పోలీసు వ్యవస్థను శాసిస్తున్నారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేను నియోజకవర్గంలో అడుగుపెట్టకూడదంటే పోలీసులు అదే అమలు చేయడం అన్యాయం. ప్రతి కార్యకర్తకు ధైర్యం నింపేందుకే వైఎస్ జగన్ జిల్లాకు వస్తున్నారు.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

పార్టీ అండగా ఉంటుంది



పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. రామగిరి ఎంపీపీ స్థానాన్ని అక్రమంగా దక్కించుకోవాలని చూసిన టీడీపీ కుట్రను తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తిప్పికొట్టారు.దీన్ని జీర్ణించుకోలేకనే పాపిరెడ్డిపల్లిలో చురుకైన కార్యకర్తను హత్య చేయించారు. రానున్న రోజుల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

– గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

భరోసా కల్పించాలి



వైఎస్ జగన్‌తో కలిసి జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కురుబ లింగమయ్య కుటుంబానికి భరోసా కల్పించాలి. జిల్లాలో ఏ మండలంలోనూ స్థానిక సంస్థల స్థానాల్లో వారికి బలం లేదు. ఎలాగైనా వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్ స్థానాలు లాక్కోవాలనే కుట్రలు, కుతంత్రాలతో దౌర్జన్యాలకు పాల్పడ్డారు.

– శంకరనారాయణ, మాజీ మంత్రి

జగనన్న కోసమే నిలబడ్డారు



కంబదూరు ఎంపీపీ ఎన్నికలో 13 మంది ఎంపీటీసీ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పునపంపారు. వీరిలో 12 మంది మహిళలు. వారిచ్చే డబ్బులు వద్దు... జగనన్న కోసం నిలబడతామని చెప్పి నిరూపించారు. చివరి వరకు ఎన్నిక ఆపాలని అధికార పార్టీ నేతలు కుట్ర పన్నారు. చివరికి జగనన్న కోసమే నిలబడి ఎంపీటీసీలు కుట్రలు తిప్పికొట్టారు.

– తలారి రంగయ్య, మాజీ ఎంపీ

ఈ దారుణాలు ఎప్పుడూ చూడలేదు



పది నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన హింసా రాజకీయాలు ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. ఈ దారుణాలు ఎప్పుడూ చూడలేదని హైకోర్టు న్యాయమూర్తులే ఆశ్చర్యపోతున్నారు. హత్యలు, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రజాభిమానాన్ని కూడబెట్టుకుని వీటిని ఎదుర్కొంటాం. వైఎస్ జగన్‌పై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తున్నారు



అమాయకులను కేసుల్లో ఇరికించి వారితో వెట్టి చాకిరీ చేయించుకోవడానికే పరిటాల కుటుంబం మళ్లీ ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తోంది. రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచే గొడవలు సృష్టించి అమాయకులను బలి చేస్తారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పదే పదే చెబుతూ వచ్చారు. అనుకున్నట్టే చేశారు.

– వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

న్యూస్‌రీల్

మహనీయుడు జగ్జీవన్ రామ్



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కేశవ్

అనంతపురం టవర్‌క్లాక్/సిటీ: సమాజంలో సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా శనివారం నగరంలో చర్చి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జయంతిని ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తోందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారన్నారు. యుక్త వయసులోనే రాజకీయాల్లోకి వచ్చారన్నారు. నేటి తరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు వాసిపై పోక్సో కేసు

తాడిపత్రిటౌన్: మైనర్‌ను మాయమాటలతో లోబరుచుకుని గర్భవతిని చేసిన వ్యక్తిపై తాడిపత్రి పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. తాడిపత్రికి చెందిన 17 ఏళ్ల అమ్మాయికి ఇన్‌స్టాగ్రామ్‌లో కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన రామాంజనేయులు పరిచయమయ్యాడు. ఈ క్రమంలో అమ్మాయికి మాయమాటలు చెప్పి తన స్వగ్రామానికి తీసుకెళ్లి.. ఆరు నెలలు సహజీవనం చేసి గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని కోరితే నిరాకరించాడు. దీంతో బాధితురాలు తాడిపత్రికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు రామాంజనేయులుపై సీఐ సాయిప్రసాద్ శనివారం పోక్సో కేసు నమోదు చేశారు.

నేడు సీతారాముల కల్యాణం

గుంతకల్లు రూరల్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కల్యాణోత్సవం సాగుతుంది. భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈఓ కే. వాణి కోరారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు పాక్షికంగా రద్దు

గుంతకల్లు: నైరుతి రైల్వే జోన్ పరిధిలోని క్యాస్టిల్ రాక్-కులెం మధ్య జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా గుంతకల్లు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమార్-వాస్కోడిగామా (18047) మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17,19,21,22,24, 26,28 తేదీల్లో షాలిమార్ నుంచి హుబ్లీ వరకు మాత్రమే నడుస్తుందన్నారు. వాస్కోడిగామా-షాలిమార్ (18048) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20,22,24,25,27,29 మే 1 తేదీ వరకు హుబ్లీ-షాలిమార్ మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుందన్నారు. తిరుపతి-హైదరాబాద్-వాస్కోడిగామా (17419/ 17021) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 24వ తేదీల్లో, వాస్కోడిగామా - తిరుపతి-హైదరాబాద్ (17420/17022) ఎక్స్‌ప్రెస్ ఈనెల 18, 25 వ తేదీల్లో హుబ్లీ వరకే వెళ్తుందని వెల్లడించారు. సికింద్రాబాద్-వాస్కోడిగామా (17039) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18, 23, 25వ తేదీల్లో, వాస్కోడిగామా- సికింద్రాబాద్ (19040) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 24,26 తేదీల్లో హుబ్లీ జంక్షన్ నుంచి రాకపోకలు సాగిస్తుందన్నారు.


బెంగళూరు-కలబురిగి ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. బెంగళూరు- కలబురిగి మధ్య ప్రతి శని, ఆదివారాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు 4 వారాలు పాటు తిప్పుతున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరు జంక్షన్ నుంచి (06519) ఈనెల 5, 12, 19, 26వ తేదీల్లో రాత్రి 9.15 గంటలకు బయలుదేరి కలబురిగి జంక్షన్‌కు మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు రైలు చేరుతుందన్నారు. తిరిగి కలబురిగి జంక్షన్ నుంచి 6, 13,20,27వ తేదీల్లో ఉదయం 9.35కు బయలుదేరి బెంగుళూరుకు అదే రోజు రాత్రి 8 గంటలకు చేరుతుందన్నారు. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయ రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాదగిరి, షాద్‌నగర్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. 2టైర్, 3ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు.

నిద్ర పట్టట్లేదు.. బ్రో



- చాలామందికి సమస్యగా మారిన నిద్రలేమి
- వేధిస్తున్న మానసిక సమస్యలు
- సమస్య జటిలంగా ఉందంటోన్న నిపుణులు
- జీవనశైలి మార్చుకోవడం మినహా మరో మార్గం లేదని వెల్లడి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రకరకాల వ్యసనాలు ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కష్టపడి నాలుగు డబ్బులు సంపాదించినా రకరకాల ఒత్తిళ్లు, రుగ్మతలతో రాత్రి ఒంటిగంట దాటినా నిద్ర పట్టడం లేదు. యాభై ఐదేళ్లు దాటిన వారి సంగతి అటుంచితే నిండా ముప్పై కూడా లేని కుర్రాళ్లు కూడా ఇబ్బంది పడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

నిద్రలేమితో వచ్చే సమస్యలు

- హైపర్ టెన్షన్ (రక్తపోటు)
- ఒత్తిడి పెరిగి మధుమేహం
- మతిమరుపు
- గుండె సంబంధిత సమస్యలు
- ఊబకాయం
- మెదడుపై ఒత్తిడి పెరిగి బ్రెయిన్ స్ట్రోక్

30– 40 ఏళ్ల వారిలో ఎక్కువ..

వాస్తవానికి యువకులకు నిద్రలేమి ఉండకూడదు. కానీ మొబైల్ వ్యసనం, బెట్టింగ్‌లు, ఆర్థిక పరిస్థితులు, ఆల్కహాల్, ఉద్యోగాల్లో ఒత్తిడి వెరసి రాత్రి పొద్దు పోయే వరకూ నిద్ర ఉండటం లేదు. మొబైల్‌కు అతుక్కుపోతుండటం అతిపెద్ద సమస్యగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 8 లక్షల మందికి పైగా ముప్పై ఏళ్లలోపు యువత చేతుల్లో ఆండ్రాయిడ్ ఫోన్‌లు ఉన్నట్టు అంచనా. సామాజిక మాధ్యమాల్లో గంటల కొద్దీ ఉండిపోతూ సమయం సంగతే మరిచిపోయిన పరిస్థితి. దీంతో నలభై ఏళ్లు దాటే లోపే జీవనశైలి జబ్బుల బారిన పడుతున్నట్టు తేలింది. 30 నుంచి 40 ఏళ్లలోపు వారికి నిద్రలేమి సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఇటీవల నిర్వహించిన ఓ పరిశీలనలో వెల్లడైంది.

డబ్ల్యూహెచ్‌ఓ సూచనల మేరకు వయసు వారీగా అవసరమైన నిద్ర ఇలా..

వయసు	రోజుకు నిద్ర (గంటలు)
4-12 నెలలు	12-16
1-2 ఏళ్లు	11-14
3-5	10-13
6-12	9-12
13-18	8-10
18 ఏళ్లు నిండితే	7 గంటలు తగ్గకుండా..

జీవనశైలి మార్చుకోవాలి



నిద్రలేమితో బాధపడుతున్న వారు వ్యసనాలను వదులుకోవాలి. జీవనశైలిని మార్చుకుంటేనే పరిష్కారం లభిస్తుంది. వేళకు తినడం, సమయానికి పడుకోవడం, మొబైల్ వినియోగం తగ్గించడం, రోజూ వ్యాయామం వంటివే దీనికి సరైన మందు. ఒక దశ వరకూ నిద్రలేమికి మందులు ఓకే గానీ, మోతాదు మించి వాడకూడదు. దైనందిన జీవితంలో మార్పులు చేసుకుంటే ఫలితం ఉంటుంది.

–డా.జాషువా కాలెబ్, న్యూరో ఫిజీషియన్

60 శాతం మందిలో సమస్య



నిద్రలేమిని వైద్య పరిభాషలో 'స్లీప్ డిప్రెషన్' అంటాం. దీన్ని చాలామంది గుర్తించడం లేదు. సకాలంలో గుర్తించి డాక్టర్ కౌన్సెలింగ్ తీసుకుంటే నియంత్రించవచ్చు. దీర్ఘకాలంగా ఇలా స్లీప్ డిప్రెషన్‌లో ఉంటే పనిచేసే సామర్థ్యం కోల్పోతారు. కుటుంబ, ఆర్థిక, ఉద్యోగ ఒత్తిళ్లతో స్లీప్ డిప్రెషన్ వస్తుంది. 60 శాతం మందిలో ఈ సమస్య కనిపిస్తోంది. ఇది అత్యంత ప్రమాదకర పరిస్థితి. మొబైల్‌ను వీలైనంతగా తగ్గించడం మంచిది.

–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, జాతీయ హెల్త్ మిషన్

డాక్టర్ మధు మృతిపై అనుమానాలు

- ఆత్మహత్య చేసుకున్నట్టు స్నేహితుల అనుమానం
- కాలుజారి పడి మృతి చెందినట్టు పోలీసుల రికార్డుల్లో..
- అనుమానాస్పదమని ఎవరూ చెప్పలేదంటున్న సీఐ



సాక్షి ప్రతినిధి, అనంతపురం: నగరంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న దంతవైద్యులు అమిలినేని మధు మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబసభ్యుల వాంగ్మూలం మేరకు మేడపై నుంచి కాలుజారి పడి మృతి చెందినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ ఆయనది ప్రమాదవశాత్తు జరిగిన మృతి కాదని, ఆత్మహత్య చేసుకున్నారని స్నేహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఏరోజూ పై అంతస్తుకు వెళ్లి నీళ్ల ట్యాంకును పరిశీలించలేదని, ఇప్పుడెందుకు చేసి ఉంటారని చెబుతున్నారు. పైగా భార్య, తల్లిదండ్రులు, సోదరులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లే ఫైనల్‌గా మూడో పట్టణ సీఐ కేసు నమోదు చేశారు. కానీ తల్లిదండ్రులు వేరే కాలనీలో ఉంటున్నారు. మధు కుటుంబం రెవెన్యూ కాలనీలో ఉంటుంది. తమ్ముడు కోర్టు రోడ్డులో ఉంటున్నారు. వేరు వేరు ప్రాంతాల్లో ఉన్న వీళ్లు కాలుజారి పడినట్టు చెప్పడం అనుమానాలకు తావిస్తోందని మధుకు బాగా కావాల్సిన వారు చెబుతున్నారు. ఒక ఉన్నతాధికారి జోక్యం మేరకు పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండానే తతంగం పూర్తి చేశారని తెలుస్తోంది.

చెడ్డపేరు రాకుండా చూడండి!

మధు, ఆయన భార్య సుష్మ ఇద్దరూ దంతవైద్యులు. టవర్‌క్లాక్ సమీపంలో రూప డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నారు. చనిపోవడానికి రెండు, మూడు గంటల ముందు క్లినిక్ నుంచి ఇంటికెళ్లే సమయంలో.. 'నేను ఇక రాను, నాకు చెడ్డపేరు తెచ్చేలా క్లినిక్‌ను నిర్వహించొద్దు' అని అన్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని అక్కడి సిబ్బంది ఎవరికీ చెప్పకుండా జాగ్రత్త పడినట్టు సమాచారం. గత కొన్ని నెలలుగా మధు.. మానసికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నట్టు ఆయన మిత్రులు చెబుతున్నారు. కాగా, త్రీటౌన్ అంటే తిమ్మిని బమ్మిని చేసే స్టేషన్ అని ఇప్పటికే విమర్శలున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వాళ్లు చెప్పినట్టే కేసు నమోదు: సీఐ

భార్య, తల్లిదండ్రులు ఇచ్చిన స్టేట్‌మెంటు ప్రకారమే కేసు నమోదు చేశామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. మృతిపై అనుమానముందని ఎవరో ఒకరు చెప్పాలని, అయితే ఎవరూ చెప్పలేదన్నారు. అయినా తమ వైపు నుంచి విచారణ చేస్తామని, ఇందుకు సమయం పడుతుందన్నారు. జారిపడిన దానికి, ఆత్మహత్య చేసుకున్న దానికి తేడాపై ప్రశ్నించగా.. 'చనిపోయినది నిన్ననే కదా. విచారణకు సమయం పడుతుంది. అప్పుడు తేలుతుంది' అని పేర్కొన్నారు.

'స్పాట్'లో సెల్‌ఫోన్లు నిషేధం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్)లో సెల్‌ఫోన్లు నిషేధం అని క్యాంపు ఆఫీసర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ స్పష్టం చేశారు. శనివారం మూల్యాంకన కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. పరీక్షలు బాగా రాసిన ఏ ఒక్క విద్యార్థీ నష్టపోకూడదన్నారు. రాసిన జవాబులను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్కులు నమోదు చేయాలన్నారు. కేంద్రంలో ఇష్టానుసారంగా తిరగకూడదన్నారు. ఒక్కో ఏఈ రోజుకు 40–45కు మించి పేపర్లు దిద్దకూడదన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రం నడుస్తుందన్నారు. సెల్‌ఫోన్ల విషయంలో చాలా సీరియస్‌గా పరిగణిస్తామన్నారు. ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కట్టుదిట్టంగా జవాబు పత్రాలు మూల్యాంకనం చేయాలని సూచించారు.

క్లుప్తంగా

బుగ్గ రామలింగేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వర స్వామి మూల విరాట్‌ను శనివారం సూర్య కిరణాలు తాకాయి. పెన్నానది ఉత్తర, దక్షిణంగా ప్రవహిస్తూ దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి ఏటా రెండు పర్యాయాలు స్వామి వారిని సంధ్యా సమయంలో కిరణాలు తాకుతాయి. ఈ అద్భుత దృశ్యాన్ని కనులారా చూసిన భక్తులు పరవశించిపోయారు. అనంతరం స్వామి వారికి అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

రైల్లోంచి జారిపడి ప్రయాణికుడి దుర్మరణం



మృతుడు యశ్వంత్ నాగోరావ్

గుత్తి: రైల్లోంచి జారి పడి ఓ ప్రయాణికుడు దుర్మరణం చెందాడు. గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలోని పెండేకల్లు క్రాసింగ్ లైన్ వద్ద శనివారం తెల్లవారుజామున ఓ రైలులో ప్రయాణిస్తున్న మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన యశ్వంత్ నాగోరావ్(43) ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైతుచూపు.. పత్తి వైపు

- జిల్లాలో 44 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి
- వ్యవసాయ బోర్లు, బావుల కింద సాగు
- అదునులో వేస్తేనే ప్రయోజనం



బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహళ్లి వద్ద సాగు చేసిన పత్తి పంట

బొమ్మనహాళ్: ఈ వేసవిలో రైతులు పత్తి పంట వైపు దృష్టి సారించారు. సాధారణంగా ఏప్రిల్ మొదటి వారంలో పత్తి సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచే వ్యవసాయ బోర్లు, బావుల కింద పత్తి సాగు చేస్తున్నారు. వేసవిలో వరి, మిరప, పత్తి మాత్రమే సాగు చేయవచ్చు. జిల్లాలోని బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, విడపకల్లు, పెద్దవడూగూరు, యాడికి, పామిడి, శింగనమల, పాల్తూరు, పెద్దపప్పూరు, గుత్తి, తాడిపత్రి, వజ్రకరూరు, ఉరవకొండ తదితర మండలాల్లో 44 వేల ఎకరాల్లో నాయక్, ఆర్మీ, సూపర్ బంటు, నందిని, తేజ తదితర రకాల పత్తి వేశారు. సాగు చేసినప్పటి నుంచి దిగుబడులు వచ్చే వరకు నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. ముంగారు వర్షాలు రాకపోతే ఎక్కువ తడులు ఇవ్వాల్సి ఉంటుంది. కాపు దశలో వర్షాలు పడితే పంట ఏపుగా పెరుగుతుంది. వేసవిలో మొలకెత్తాక ఉష్ణోగ్రతలకు పత్తి దెబ్బతినకుండా తట్టుకుంటుందనే సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడులు పెడుతున్నారు. సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు అందుతాయి. దిగుబడులు ప్రారంభమైన 40 రోజులకు పూర్తిగా చేతికి వస్తాయి. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడులు వస్తాయని రైతులు అంచనా వేస్తున్నారు.

ధరలు ఉంటే మంచి ఆదాయమే

పత్తికి మార్కెట్‌లో ధరలు బాగుంటే రైతుకు మంచి ఆదాయం వస్తుంది. గత ఏడాది క్వింటా రూ.7,300 నుంచి రూ.8,200 వరకు ధర పలికింది. ఈ ఏడాది మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వద్ద సాగు చేసిన పత్తి పంట

లాభదాయకమైన పంట



పత్తి సాగుకు పెట్టుబడులు క్రమేణా పెరుగుతున్నాయి. విత్తనాలు, కలుపు తీయడం, తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయడం, కూలీల ఖర్చులు ఇలా ఎకరాకు రూ.30వేలకు పైగానే ఖర్చు వస్తుంది. పరిస్థితులు అనుకూలించి మార్కెట్లో మంచి ధర లభిస్తే రైతులకు లాభదాయకమే.

– చాకలి శివలింగ, కల్లుదేవనహళ్లి, బొమ్మనహాళ్ మండలం

పత్తి సాగుతో రైతులకు ఊరటే



వేసవి సీజన్‌లో పత్తి సాగు రైతులకు ఊరటనిస్తుంది. అధిక దిగుబడులు.. గిట్టుబాటు ధర ఉంటుందనే ఆశతో పత్తి సాగును ఎంచుకుంటున్నారు. ఈ ఏడాది మండలంలో పత్తి సాగు పెరిగే అవకాశం ఉంది. సకాలంలో తెగుళ్లను నివారిస్తే దిగుబడులు బాగుంటాయి.

– సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

కష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

- జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ

ఉరవకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే తాను ఐఏఎస్ సాధించానని, ఇష్టంతో కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాలనైనా చేరుకోవచ్చని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ పేర్కొన్నారు. శనివారం అనంతపురంలోని రోటరీపురం వద్ద సీసీఎల్ క్యాంపస్‌లో ఉరవకొండకు చెందిన నిస్వార్థ ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ సంయుక్తగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు 'సూపర్–60' పేరుతో ఏపీఆర్‌జేసీ, పాలిసెట్, ఆర్జీటీ సెట్‌కు ఉచిత కోచింగ్ ప్రారంభించాయి. జాయింట్ కలెక్టర్ హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో చదివితేనే ర్యాంకులు వస్తాయని అనుకోవడం భ్రమ అని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్ సాధించిన వారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం అభయ ఫౌండేషన్ నిర్వాహకులు స్వామి బాలచంద్ర మాట్లాడుతూ రూ.లక్షల కోసం కాకుండా లక్ష్యం కోసం చదవాలని సూచించారు. పరీక్షల కోసం మాత్రమే శిక్షణ కాదని, శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఇస్తున్నామని చెప్పారు. నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకట్ తాటికొండ మాట్లాడుతూ 2047 వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబుళేసు, నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు చంద్ర, వాణి, రజినీ తదితరులు పాల్గొన్నారు.

జీసీజీటీఏ జిల్లా నూతన కార్యవర్గం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీధర్ రెడ్డి, కార్యదర్శిగా వి.షణ్ముక ఆచారి, ఉపాధ్యక్షుడిగా వి.వీరాంజనేయులు, జాయింట్ సెక్రటరీగా జి.నారాయణస్వామి, మహిళా విభాగం కార్యదర్శిగా కె.శ్రీసుధ, స్టేట్ కౌన్సిలర్లుగా బి.బాపూజీ, పి.హనుమంతరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బి.మనోహర్‌రెడ్డి వ్యవహరించారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న అనంత, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంత మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఆయన పోరాటాలను స్మరించుకోవడంతో పాటు స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగ్జీవన్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్యోద్యమంలో ఎంతో కీలకంగా పని చేశారన్నారు. అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు రావాలని పోరాడారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ జగ్జీవన్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, అనుబంధ సంఘాల అధ్యక్షులు మల్లెమీద నరసింహులు, అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు పెన్నోబులేసు, మాల్యవంతం మంజుల, చామలూరు రాజగోపాల్, ఎగ్గుల శ్రీనివాసులు, చింతకుంట మధు, రాధాకృష్ణ, పసులూరు ఓబులేసు, కొర్రపాడు హుస్సేన్ పీరా, వనారస బలరాం, లక్ష్మణ్, తలారి వెంకటేష్, అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు రహంతుల్లా, కమల్‌భూషణ్, సాకే చంద్రలేఖ, రాజేశ్వరి, శేఖర్‌బాబు, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

కురుబ లింగమయ్యది రాజకీయ హత్యే



లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ

- బీసీ కులాలపై పరిటాల కుటుంబం కక్ష కట్టింది
- వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ ధ్వజం

సాక్షి, పుట్టపర్తి: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్యది ముమ్మాటికీ రాజకీయ హత్యే అని వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎ. శివ స్పష్టం చేశారు. శనివారం ఆయన లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ పరిటాల కుటుంబం ఆధిపత్యం కోసం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లు రాప్తాడు నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా గడిపారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హత్యా రాజకీయాలు మొదలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక బీసీ వర్గానికి చెందిన లింగమయ్యను దారుణంగా హత్య చేయించారని ఆరోపించారు. లింగమయ్య హత్యలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరో వైపు రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి శ్రీకారం చుట్టి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. రాప్తాడులో పరిటాల రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు, హత్యలు చేస్తున్నారని, ఇవి కొన్నాళ్లే అని, తమ ప్రభుత్వం వస్తే అప్పుడు వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. టీడీపీ నేతలు తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మంత్రి సవిత కురుబ సామాజిక వర్గానికి చెందిన వారే అయినా లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లింగమయ్య కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. త్వరలోనే తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఆసీఫుల్లా, మహేష్ గౌడ్, మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యం.. దైన్యం

- రోడ్డెక్కని వెటర్నరీ అంబులెన్స్‌లు
- కాంట్రాక్ట్ గడువు ముగిసిందని నిలిపివేత
- తక్షణ వైద్య సేవల కోసం ఎదురుచూపు



జేడీఏ కార్యాలయ ఆవరణలో ఆగిపోయిన 1962 మొబైల్ అంబులెన్స్‌లు

అనంతపురం అగ్రికల్చర్: మూగజీవాలకు తక్షణ వైద్య సేవలందించే మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్ వాహనాలు ఇంకా రోడ్డెక్కలేదు. గత ఫిబ్రవరి 16 నుంచి మొదటి విడతగా ఉమ్మడి జిల్లాకు చేరిన 14 వాహనాలు ఎక్కడికక్కడ నియోజకవర్గ కేంద్రాల్లోనే ఆగిపోయాయి. రెండో విడతగా అందుబాటులో ఉన్న మరో 14 వాహనాలు ఈ నెల 15 నుంచి ఆగిపోయే పరిస్థితి ఉందని చెబుతున్నారు. దీంతో 1962 హెల్ప్‌లైన్ కింద మారుమూల ప్రాంతాల్లో సైతం పశువులు, జీవాలు, ఇతరత్రా మూగజంతువులకు అందిస్తున్న విశిష్ట వైద్య సేవలు నిలిచిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 మే 19న దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ల పేరిట అంబులెన్స్‌లు ప్రవేశపెట్టింది. కూటమి సర్కారు వచ్చాక కాంట్రాక్టు గడువు ముగిసిందంటూ నెలన్నర రోజులుగా మొదటి విడత వాహనాలు నిలబెట్టేశారు. త్వరలో రెండో విడత అంబులెన్స్‌లు కూడా ఆపనున్నట్లు తెలుస్తోంది. మనుషులకు 108 అంబులెన్స్‌లు అందిస్తున్నట్లుగా పశువులకు 1962 ద్వారా మొబైల్ అంబులెన్స్‌లు తక్షణ వైద్యసేవలు అందిస్తున్నాయి. దీనికింద పశుసంవర్ధకశాఖ డాక్టర్లు, ఏడీలు సహకారంతో 1962 డాక్టర్లు ఎన్నో అరుదైన కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు చేస్తూ వస్తున్నారు. అలాంటి వాహనాలను నెలల తరబడి ఆపేస్తున్నారు.

పశు వైద్య సేవలకు ఇబ్బందే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశువులు, ఎద్దులు 4,97,102, గేదెలు 2,85,443 ఉన్నాయి. అలాగే గొర్రెలు 49,26,587 ఉండగా మేకల సంఖ్య 8,84,186 ఉన్నాయి. 12,767 పందులు, 25 లక్షల సంఖ్యలో కోళ్లు, 1.57 లక్షలకు పైగా కుక్కలు, అలాగే గాడిదలు, గుర్రాలు, ఇతరత్రా మూగజీవాలు మరికొన్ని ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ లెక్కలు చెబుతున్నాయి. వీటన్నింటికీ తక్షణ వైద్య సేవలు ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెబుతున్నారు.

త్వరలో అందుబాటులోకి

మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్ వాహనాల నిర్వహణకు సంబంధించి కొత్త కాంట్రాక్టు సంస్థ ఖరారైంది. ఈ నెల 15 తర్వాత అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మూగజీవాలకు వైద్య సేవలు పునరుద్ధరణ కానున్నాయి.

– డాక్టర్ జీపీ వెంకటస్వామి, పశుశాఖ జేడీ

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

గుత్తి రూరల్: శ్రీపురం గ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని సర్పంచ్ ఉండ్ర రామలింగమయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, నంద్యాల, అన్నమయ్య జిల్లాల వృషభాలు పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన మస్తాన్‌యాదవ్ వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.30వేలు, బొమ్మనహాల్ మండలం గోవిందవాడకు చెందిన గురుస్వామి వృషభాలు రెండవ స్థానంలో నిలిచి రూ.20వేలు, లింగదల్ ఎర్రిస్వామి వృషభాలు మూడో స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. వైఎస్సార్ జిల్లా వేముల మండలం తెర్నపాడు గ్రామానికి చెందిన భువనేశ్వర్ కుమార్ వృషభాలు రూ.10వేలు, గుత్తి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన మోహన్‌బాబు వృషభాలు రూ.5వేల నగదు బహుమతులు గెలుపొందాయి. కార్యక్రమంలో గ్రామస్తులు కోనా లక్ష్మణరావు, చంద్ర, లోకేష్, నామాల సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అనంత'తో సతీష్‌రెడ్డి భేటీ



సతీష్ రెడ్డిని సత్కరిస్తున్న
పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఎమ్మెల్సీ వేంపల్లి సతీష్‌రెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి కాసేపు మాట్లాడుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణులను సతీష్‌రెడ్డికి పరిచయం చేశారు. పార్టీ నాయకులు సతీష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, కండువాతో సన్మానించారు.

8న సుంకులమ్మ జాతర

అనంతపురం కల్చరల్: నగరంలోని 5వ రోడ్డులో వెలిసిన నల్లమల సుంకులమ్మ జాతరను ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి ఉంగరాల శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గ్రామోత్సవం, అన్నదానం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు.

సంధ్యామూర్తికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకున్న సంధ్యామూర్తి, చిన్నారులు

అనంతపురం కల్చరల్: హైదరాబాద్‌లో మహతి ఆర్ట్స్ అకాడమీ వారు తెలంగాణ సారస్వత పరిషత్తుతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖులకు శనివారం ఉగాది పురస్కారాలు అందజేశారు. నగరానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి ఉగాది పురస్కారం అందుకున్నారు. శ్రీనృత్యకళానిలయం చిన్నారులు హిమశ్రీ, హర్షవర్ధ, చందాహాసిని, దీక్షిత వైష్ణవి, వేదాన్విత తదితరులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో ఉత్తమ విజేతలకందించే స్వర్ణకలశం అందుకున్నారు. ప్రఖ్యాత యక్షగాన దర్శకుడు, తెలుగు యూనివర్సిటీ వీసీ చలపతి అనంత వాసులను అభినందించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

రాప్తాడు: గుర్తు తెలియని అనాథ వృద్ధుడి మృతదేహానికి స్థానిక పంచాయతీ కార్మికులు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. ఓ గుర్తు తెలియని 90 ఏళ్ల వృద్ధుడు 8 నెలలుగా భిక్షాటన చేస్తూ స్థానిక బస్టాండులో కనకదాస విగ్రహం పక్కనే ఉన్న పాత సచివాలయం దగ్గర రాత్రి పూట నిద్రించేవాడు. తనది వైఎస్సార్ జిల్లా కమలాపురం అని.. బంధువులు అక్కడే ఉన్నారని స్థానికులకు చెప్పినట్లు సమాచారం. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీహర్ష, సర్పంచ్ సాకే తిరుపాలు స్పందించారు. స్థానిక పంచాయతీ కార్మికులతో మాటాడారు. మృతదేహన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్లి శ్మశానంలో అంత్యక్రియలు జరిపించారు.

బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక బచ్‌పన్, శ్రీసాయి అకడమిక్ హైటెస్ స్కూల్ 12వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ విశాల ఫెర్రర్, రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. 12 ఏళ్లలో విద్యార్థులు సాధించిన విజయాలను యాజమాన్యం తెలియజేసింది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులందరూ రావాలని సూచించారు.

రాములోరి కల్యాణం చూతము రారండి



- నేడు శ్రీరామనవమి
- నగరంలో ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- ఆకట్టుకోనున్న ఉట్లమాను పరుష



రెవెన్యూ కాలనీలో సీతారాములను అలంకరించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: భద్రాచలం, ఒంటిమిట్టల్లో ప్రసిద్ధి చెందిన రామాలయాలను తలపిస్తూ అదే సంప్రదాయంలో సాగే మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణానికి సన్నాహాలు పూర్తయ్యాయి. ఇప్పటికే రామాలయం సర్వాంగ సుందరంగా విద్యుద్దీప కాంతులతో వెలుగులీనుతోంది. గతంలో భద్రాద్రి నుంచి మరోసారి ఒంటిమిట్ట నుంచి తెప్పించిన తలంబ్రాలతో స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించనున్నారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ఈసారి మరింత భిన్నంగా గోటితో ఒలచి వడ్ల నుంచి తీసిన బియ్యపు గింజలను తలంబ్రాలుగా మార్చడానికి అర్చక, భక్తబృందాలు పది రోజులుగా శ్రమిస్తున్నారు. ప్రసిద్ధ క్షేత్రాల నుంచి విచ్చేసిన ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవం జరపనున్నారు.

వాడవాడలా కల్యాణోత్సవాలు

శ్రీరామనవమి వచ్చిందంటే ఉట్లమాను ఉత్సవాలు అత్యంత సందడిగా సాగుతాయి. జీఆర్ ఫంక్షన్ హాలు ఎదురుగా, పాతూరు సున్నంగేరి, ఆరవ రోడ్డు తదితర చోట్ల ఉట్ల పరుష కనుల పండువగా జరుగనుంది. అలాగే నగరంలోని మారుతీనగర్, రెవెన్యూ కాలనీ, పాతూరు సున్నంగేరులోని పురాతన రామాలయం, నాలుగో రోడ్డు సీతా రామాంజనేయస్వామి దేవస్థానం, జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన హౌసింగ్ బోర్డులోని నిలువెత్తు అభయాంజనేయస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని చోట్ల ప్రత్యేక పూజోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. వాడవాడలా సీతారామ కల్యాణోత్సవాలు, సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తారు. తపోవనంలోని శివశక్తి సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా చందనోత్సవం పోస్టర్లను డీఆర్వో మలోల ఆవిష్కరించారు. సాయిట్రస్టు నిర్వాహకుడు విజయ్‌సాయి మాట్లాడుతూ.. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు చందనాన్ని అందిస్తామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విద్యుత్ వెలుగుల్లో సున్నపు గేరిలోని రామాలయం

ప్రత్యేక ఆకర్షణగా బైక్ ర్యాలీ

వేలాది మంది హిందుత్వ సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు శ్రీరామనవమి సందర్భంగా ఐక్యతను సాధించే దిశగా భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో నగరమంతటా కాషాయం నింపుకున్నట్లు సాగుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే బైక్ ర్యాలీ ఆదివారం ఉదయం స్థానిక జూనియర్ కాలేజ్ వద్ద ప్రారంభం అవుతుంది. ప్రధాన వీధుల్లో సాగుతుంది. తెలంగాణ ఎంపీ రఘునందనరావు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా విచ్చేసి బైక్ ర్యాలీని ప్రారంభిస్తారని ఉత్సవ కమిటీ కన్వీనర్ శబరి తెలిపారు.

శ్రీరామ జపం నిర్వి'రామం'

అనంతపురం కల్చరల్: శ్రీరామచంద్రుడి నామస్మరణ నిర్వి'రామ'ంగా కొనసాగుతోంది. పలు ఆలయాల్లో శ్రీరామనవమి రోజు ఉదయం వరకు సామూహిక అఖండ నామస్మరణ చేస్తున్నారు. స్థానిక రెవిన్యూ కాలనీలోని కోదండ రామాలయంలో 48 గంటలుగా శ్రీరామ నవమి వేడుకలను నిరాఘాటంగా భక్తులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అఖండ శ్రీరామ నామస్మరణతో భజనలు, శ్రీరామ తారక జపం, రామ హోమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రతినిధి మెకవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం రాముల కల్యాణం, నగరోత్సవం సాగుతాయని తెలిపారు. అలాగే అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయం, పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం తదితర చోట్ల అఖండ రామనామాన్ని జపిస్తున్నారు. 16 ఏళ్లగా అఖండ రామనామ జపం సాగుతోందని ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా అందజేసే మజ్జిగ, పానకం పెసరబాళ్ల ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

ఆకట్టుకున్న నగర సంకీర్తన



శ్రీరాముడి చిత్రపటంతో భక్తిగీతాలు ఆలపిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆహ్వానిస్తూ స్థానిక సోమనాథ్ నగర్ రామాలయం భక్తబృందాలు నగర సంకీర్తను నిర్వహించారు. శనివారం శ్రీరాముడి చిత్రపటంతో సోమనాథ నగర్, తపోవనం పరిసర ప్రాంతాల్లో శ్రీరామ సంకీర్తనలను ఆలపిస్తూ ఇంటింటికీ వెళ్లి శ్రీరామ నవమి వేడుకలకు భక్తులను ఆహ్వానించారు. అంతకు ముందు నగర సంకీర్తనకు భక్తులు అడుగడుగునా హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నాగభూషణంతో పాటూ భక్తమండలి ప్రతినిధులు మణిబారు నాగరాజు, ప్రసాద్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కుటుంబాలకు ఆర్థికసాయం



హమాలీ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: అనారోగ్యంతో మరణించిన హమాలీల కుటుంబాలు, రిటైర్మెంట్ తీసుకున్న హమాలీలకు కొత్తూరు హమాలీ యూనియన్ ద్వారా రూ.2.80 లక్షల ఆర్థిక సహాయం అందించారు. శనివారం స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు సంఘం నాయకులు చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో మృతి చెందిన హమాలీ దూదేకుల బాషా భార్య షమీమ్‌కు రూ.70 వేలు, ఆయన తల్లి బావమ్మకు రూ.30 వేలు, తలారి ముత్యాలు భార్య జయలక్ష్మికి రూ.లక్ష, ఆరోగ్య కారణంతో రిటైర్మెంట్ పొందిన నారాయణస్వామికి రూ.80 వేల సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, హమాలీ వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు రాజు, నారాయణ, బాబావలి, బాబు, బాషా, రామాంజినేయులు, రాము, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో అవకాశాలు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం: భవిష్యత్తు అంతా కృత్రిమ మేధ మీదే ఆధారపడి ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)తో కేవలం కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్ వారికే కాదు. అన్ని బ్రాంచుల వారికి అపార అవకాశాలు ఉంటాయని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నా రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఈఈఈ విభాగంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఐ–2025 జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోలార్, ఎలక్ట్రికల్ వాహనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ రంగాల్లో మంచి ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. పరిశ్రమ–కళాశాలకు మధ్య సంబంధాలు మెరుగుపరచుకుంటే ఉపాధికి ఢోకా లేదన్నారు. ఐ–2025 సందర్భంగా నిర్వహించిన క్విజ్, సెమినార్, పోస్టర్ ప్రజెంటేషన్, ట్రాజర్ హంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమం కన్వీనర్‌గా, జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, కో–కో ఆర్డినేటర్లుగా ఎం.రత్తయ్య, వై.మానస వ్యవహరించారు. కార్యక్రమంలో ఆర్జేయూకేటీ వీసీ, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి

అనంతపురం: కదిరిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని కదిరి బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కే.సురేష్ రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలసి సమస్యలు విన్నవించారు. కదిరి చుట్టుపక్కల 10 మండలాలు ఉన్నాయని తెలిపారు. ఇందుకు జస్టిస్ కే.సురేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌడప్ప, జనరల్ సెక్రెటరీ సురేంద్ర, మాజీ అధ్యక్షుడు నాగేంద్ర రెడ్డి, న్యాయవాదులు భైరవ ప్రసాద్, రామస్వామి, రఘునాథ్ పాల్గొన్నారు.

విజయరామరాజును స్ఫూర్తిగా తీసుకోండి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నిబద్ధత, నిస్వార్థ ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మాజీ శాసన మండలి సభ్యుడు వీణా విజయరామరాజును నేటి తరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సీలూరి రమణారెడ్డి పిలుపునిచ్చారు. వీణా విజయరామరాజు వర్ధంతి సందర్భంగా శనివారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ.. వీణా విజయరామరాజు అర్ధ శతాబ్దికి పైగా ఉపాధ్యాయ ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించారన్నారు. సంఘ నిర్మాణంలో ఉద్యమ ప్రస్థానంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగా, బాధ్యతాయుత పౌరుడిగా, నిబద్ధత గల సంఘ నాయకుడిగా, ఉపాధ్యాయులే తన కుటుంబంగా భావించి అందరి మనస్సుల్లో పదిలంగా తన ఆశయాలను దాచుకున్న మహానీయుడని కొనియాడారు. వామ పక్షాలు భావాలు కలిగి సమసమాజ స్థాపనే ధ్యేయంగా ఉపాధ్యాయులను నిర్దేశిత పథం వైపు పయనం సాగించేలా చర్యలు తీసుకున్నారన్నారు. శాసన మండలి సభ్యుడిగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై శాసన మండలిలో తన గళం విప్పిన నాయకుడు అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, సురేష్, రాజశేఖర్, కిషోర్ కుమార్, నాగభూషణం, మల్లికార్జున, రామకృష్ణ, సోమశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాళ్లు

అనంతపురం ఎడ్యుకేషన్: రెండు రోజుల క్రితం వెలువడిన ఐఎన్‌టీఎస్ఓ రెండో లెవెల్ ఫలితాల్లో అనంతపురం శ్రీచైతన్య స్కూళ్ల విద్యార్థులు అత్యధికంగా గ్రాండ్ ప్రైజ్‌ల కింద 7 ల్యాప్‌టాప్‌లు కైవసం చేసుకున్నారు. శనివారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభిందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం జోన్‌కు చెందిన శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు 28 మంది మొదటి ప్రైజ్‌లు, 43 మంది విద్యార్థులు రెండో ప్రైజులు సాధించారన్నారు. 43 మంది విద్యార్థులు మూడో ప్రైజ్, 39 మంది విద్యార్థులు నాలుగో ప్రైజ్‌ను, 53 మంది విద్యార్థులు 5వ ప్రైజ్‌ను, 955 మంది విద్యార్థులు కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. 1815 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు, ప్రైమరీ తరగతుల నుంచి 110 మంది విద్యార్థులు స్పెషల్ ప్రైజ్‌ను, 165 మంది విద్యార్థులు కన్సొలేషన్ ప్రైజ్‌ను, 382 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మొత్తంగా 3,640 మంది విద్యార్థులు ఈ ఒలిపియాడ్ పరీక్షల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయిలోనే అగ్రగామిగా నిలిపారని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, సమీనా ఖాన్, తబస్సుమ్, వెంకటేష్, రాధిక, పర్వీన్ భాను, నేత్రావతి, శాంత, నారాయణ స్వామి, నరేష్, మురళి, కో–ఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, నాగభూషణం, ఇర్షాద్, డీన్లు రిషిబాల, ముత్యాలన్న, చంద్రమోహన్, సత్యనారాయణ, అప్పలనాయుడు, మహేష్, చంద్రశేఖర్, సిరాజుద్దీన్, అప్పలనాయుడు, చినబాబు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మేయర్ వసీం, తదితరులు



జేఎన్‌టీయూలో నివాళులర్పించిన ఉద్యోగులు

అనంతపురం సిటీ: సామాజిక వివక్షతపై రాజీలేని పోరాటం చేసి, విజయం సాధించిన గొప్ప కార్యసాధకుడు, యోధుడు బాబూ జగ్జీవన్‌రాం. ఆయన ఆశయసాధనకు కృషి చేద్దామని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డితో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ.. పట్టుదల, ఆశయ సాధనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన జగ్జీవన్‌రాంను నేటి తరం నేతలు స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. విలువలతో కూడిన ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు విజయ భాస్కర్‌రెడ్డి, ధనుంజయ, శ్రీవాణి, రత్నాబాయి, మహబూబ్ వలి, షబ్బీర్ నియాజ్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో..

అనంతపురం టౌన్: సమాజంలో సమానత్వం కోసం పోరాటం చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ బాటలో నడుద్దామని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ పిలుపునిచ్చారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్, రాజశేఖర్, ఏఓ రామకృష్ణ, డీఈఈ గంగన్నతోపాటు పలువురు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

అనంతపురం సిటీ: జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో ఉన్న వేమన టెలిఫోన్ భవన్‌లో బాబూ జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీఎస్ఎన్ఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామచంద్ర, నాయకులు రంగనాయకులు, రాజా రమేశ్, సభ్యులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అనంతపురం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడుద్దామని అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డాక్టర్ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: బాబూ జగజ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అన్నారు. శనివారం జగజ్జీవన్ రామ్ జయంతిని స్థానిక జేవీవీ కార్యాలయంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, డాక్టర్ ప్రసూన, మహ్మద్ జిలాని, రామరెడ్డి, తిరుపాలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: గిరిజన ప్రజా సమాఖ్య ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్, భాస్కర్ నాయక్, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో..

మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ అదనపు ప్రధాన కార్యద్శి బండారు శంకర్,హనుమంతరావు, సాకే పెద్దన్న,రమేష్, నగేష్, నాగరాజు, దేవర పుల్లన్న, శ్రీనివాశులు, లక్ష్మన్న, సి.నాగరాజు, నాగభూషణం ,కిష్టప్ప, రామాంజనేయులు. ఎర్రిస్వామి, చిరంజీవి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈఎస్ ఆధ్వర్యంలో..

జాతీయ కో–ఆర్డినేటర్ నాగభూషణం,నారాయణ నాయక్, శ్రీనివాసులు, ఓబులేసు, ఉమాశంకర్, నారాయణప్ప, మల్లికార్జున, రాజా రమేష్, రామాంజినేయులు. వరప్రసాద్, మహేష్ నాయక్, నాగేంద్ర, గంగన్న, ముత్యాలప్ప, భార్గవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

అనంతపురం అర్బన్: స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ ఈ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫరూక్, గౌర వాధ్యక్షుడు ఫకృద్దీన్, ఉపాధ్యక్షుడు అష్రఫ్ ఆలీ, జిలాన్, కోశాధికారి దౌలా, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ, జేఎన్‌టీయూలో..

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకట నాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి నివాళులర్పించారు.



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు



జిల్లా పోలీసు కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ జయంతి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు